పంజాగుట్ట ఎస్‌హెచ్‌ఓగా బండారి శోభన్

ఖైరతాబాద్, జనవరి 30 : పంజాగుట్ట ఎస్‌హెచ్‌ఓగా బండారి శోభన్ నియమితులయ్యారు. పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న దుర్గారావు ఓ యాక్సిడెంట్ కేసులో సస్పెండ్ కాగా, నెల రోజులుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం నగర కమిషనరేట్‌లోని వీఆర్ విభాగంలో పనిచేస్తున్న బండారి శోభన్‌ను పంజాగుట్ట ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అత్తాపూర్, జనవరి 30: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పలు ఫీడర్లలో బుధవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అత్తాపూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు అత్తాపూర్ ఆఫీస్, కిషన్‌బాగ్, ఎస్సీనగర్, జలాల్‌బాబానగర్, సిక్ చౌనీ, నంది ముస్లాయిగూడ, అత్తాపూర్, మారుతీ నగర్, పాండురంగానగర్, రాంబాగ్, తేజస్వీనగర్ కాలనీ, సీబీఐటీ కాలనీ, సోమిరెడ్డినగర్, వీకర్‌సెక్షన్ కాలనీ, వాసురెడ్డినగర్ ప్రాంతాలు. హైదర్‌గూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నలందానగర్, ప్రజెంట్ పార్క్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీ, అత్తాపూర్, రాంబాగ్, సాగర్ ఎర్త్ మోర్, తేజస్వీనగర్ కాలనీ, సంజీవ నిహిల్స్, సిరిమల్లేనగర్, ఏజీ కాలనీ, ఈశ్వర్ థియేటర్ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

వ్యక్తి అదృశ్యం

కార్వాన్, జనవరి 30 : వ్యక్తి అదృశ్యమైన ఘటన టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. జిర్రాలో నివసించే యూసుఫ్‌ఖాన్(52)కు మాటలు రావు. కాగా గత డిసెంబర్ 5న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యూసుఫ్‌ఖాన్ తిరిగి రాలేదు. దీంతో అతని భార్య హసీనా బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తే చర్యలు

- వ్యర్థాల తరలింపునకు టోల్ ఫ్రీ నంబర్18001201159
- కఠిన చర్యలు తీసుకుంటాం: డీసీ సేవా ఎస్లావత్

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రోడ్లపై పారబోసిన భవన నిర్మాణ వ్యర్థాలు(ఫైల్)

జూబ్లీహిల్స్, జనవరి30 : యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై నగర పాలక సంస్థ కొరడా ఝులిపించనుంది. నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్న బల్దియా అందుకు అనుగుణంగా పారిశుధ్య ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భవన నిర్మాణ వ్యర్థాలు తరలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. పాత ఇంటిని తొలగించి కొత్త ఇంటి నిర్మాణాలు చేపట్టే యజమానులు ఒక్క ఫోన్ కొడితే సంబంధిత సిబ్బంది వాహనాలతో వచ్చి భవన నిర్మాణ వ్యర్థాలు నిర్దేశించిన డంపింగ్ యార్డులకు తరలించనున్నారు. ఇప్పటికే భవన నిర్మాణ వ్యర్థాల రీ సైక్లింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ఆయా వ్యర్థాలను అక్కడికి తరలిస్తారు. అయితే అవగాహన లేకపోవడంతో పాత ఇంటిని కూల్చిన యజమానులు నిర్మాణ వ్యర్థాలను ప్రైవేట్ వాహనాల్లో అధిక ధరలకు తరలించి నష్టపోతున్నారు. కాగా ఆయా వాహనదారులు దొంగచాటుగా వ్యర్థాలను సమీపంలోని రోడ్ల పై పడేసి వెళ్లిపోతున్నారు. దీంతో ఆయా వాహనాలను పట్టుకునేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చెత్త, వ్యర్థాలు పడేస్తారని అనుమానం ఉన్న ప్రాంతాల్లో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు రాత్రిపూట గస్తీ కాస్తున్నారు. ఈ మేరకు యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఎస్లావత్, ఏఎంఓహెచ్ డాక్టర్ కె ఎస్ రవితో కలిసి యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించి రాత్రిపూట పెంచాల్సిన నిఘాపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కాగా భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై డంప్ చేసే వాహనాలకు మొదటిసారి పట్టుబడితే రూ.10 వేలు, రెండవ సారి రూ.25 వేలు, మూడవ సారి రూ.50 వేల జరిమానాలు విధించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు పారబోసే వాహనాలను చివరిగా సీజ్ చేయనున్నట్లు హెచ్చరించారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు టోల్ ఫ్రీ 1800-120-1159 నంబర్‌తో పాటు 91009 27073 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

తక్కువ ధరకు నిర్మాణ వ్యర్థాలు తరలిస్తాం..

రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇంటి యజమానులు సమాచారమిస్తే తక్కువ ధరకు భవన నిర్మాణ వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ వాహనాల్లో తరలిస్తాం. ఆయా వాహనాలతో వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలిస్తాం. నిబంధనలు పాటించని వారికి మూడుసార్లు జరిమానాలు విధిస్తాం. పెడచెవిన పెట్టిన వారి వాహనాలను సీజ్ చేస్తాం. రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలను పారబోసి ఇతరులకు అసౌకర్యం కలిగించవద్దని మనవి.

- సేవా ఎస్లావత్, డిప్యూటీ కమిషనర్, యూసుఫ్‌గూడ 19వ సర్కిల్.

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ బూత్ స్థాయి శిక్షణ

మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

జూబ్లీహిల్స్, జనవరి 30 : జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్స్ శిక్షణ కార్యక్రమం మంగళవారం కల్యాణ్‌నగర్‌లోని జేఎఫ్ ప్రైమ్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజారుద్దీన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ కన్వీనర్ కె.ఉపేందర్ రెడ్డి, నాయకులు భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ శివరాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు రూప గీసిన ఆర్ట్ గ్యాలరీని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గీసిన పలు చిత్రాలను ఎమ్మెల్యే అభినందించారు. *- బండ్లగూడ, జనవరి 30*

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం

విఠల్‌వాడిలో మంచినీటి నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఎమ్మెల్యే దానం నాగేందర్

హిమాయత్‌నగర్, జనవరి 30 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తూ మెజార్టీ ఎంపీ సీట్లను గెలిచి సత్తా చాటుతామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. మంగళవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో రూ.కోటి 39 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, మంచినీటి, డ్రైనేజీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్‌తో ఎమ్మెల్యే దానం నాగేందర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిమాయత్‌నగర్ వీధి నం.5,9 లో రూ.99లక్షలతో సీ.సీ రోడ్లు, విఠల్‌వాడీలో రూ.40లక్షలతో మంచి నీటి, డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం హైదర్‌గూడలో ఉన్న లవ్లీ స్పాట్ హోటల్‌కు వెళ్లి పార్టీశ్రేణులతో కలిసి ఎమ్మెల్యే దానం నాగేందర్ చాయ్ తాగుతూ ప్రజల యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడ జలమండలి మేనేజర్ మహేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ దివ్య, బీఆర్ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్, అనీష్ గంగపుత్ర, జాకీ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మణికొండ కౌన్సిల్ సమావేశం

- ఎజెండాను తిరస్కరించిన మెజార్టీ సభ్యులు
- అనంతరం జరిగిన బడ్జెట్ సమావేశానికి హాజరైన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, పాల్గొన్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

మణికొండ, జనవరి 30 : మణికొండ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా జరిగింది. ఐదు నెలలుగా ప్రజాసమస్యలను గాలికొదిలి..ఇప్పుడు టేబుల్ ఎజెండా అంటూ ఏవిధంగా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారంటూ మెజార్టీ సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపాలిటీలో అధికారులు పనిచేస్తున్నారా? లేక కాలయాపన కోసం కార్యాలయానికి వచ్చి వేతనాలు పొందుతున్నారా? అంటూ మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం చివరకు కొన్ని అత్యవసర వేతనాల చెల్లింపులు తప్పా మిగతా తీర్మాణాలను నిలిపివేశారు. ప్రజాపరిపాలన కార్యక్రమంలో విధులు నిర్వహించిన ఉద్యోగులకు, ఇతర అవసరాల కోసం మాత్రమే నిధులను చెల్లించేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అత్యవసర పనులకు ప్రాధాన్యత కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మరోసారి సమావేశం నిర్వహించాలని పట్టుబట్టారు. పరిపాలనలో పాదర్శకత లోపించడంపై మున్సిపల్ కౌన్సిలర్లు.. కమిషనర్ ఫల్గుణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. దీంతో కమిషనర్‌కు, సభ్యులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ఎమ్మెల్యేగా పోటీ చేయడం వల్ల దాదాపు ఐదు నెలలుగా సమావేశం జరుగలేదన్నారు. మంగళవారం సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు, అలాగే టేబుల్ ఎజెండా పైన సమాచారం ఇవ్వలేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అదనపు కలెక్టర్ సమక్షంలో బడ్జెట్ సమావేశం

వాడివేడిగా సాగిన కౌన్సిల్ సమావేశం అనంతరం నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఆమోదయోగ్యంగా సభ్యులు చర్చించి పలు తీర్మానాలను ఆమోదించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మణికొండ మున్సిపాలిటీలో మంగళవారం రెండో విడత నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లంతా ఒకే తాటిపైకి వచ్చి ప్రజాసమస్యలపై సుదీర్ఘంగా చర్చించి అవసరమైన పనులకు నిధులను వెచ్చించాలని ఆమోదముద్ర వేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై రాజకీయాలకు అతీతంగా సభ్యులంతా ఆమోదించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, ప్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలి

కాటేదాన్ సీఐటీయూ కార్యాలయంలో దేశవ్యాప్త సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.కవిత తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 30: ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.కవిత డిమాండ్ చేశారు. కాటేదాన్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా సీఐటీయూ, జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ సదస్సు నిర్వహించారు. ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత, లలిత అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.కవిత హాజరై సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 18 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే పని గంటలు, పని భారం పెరిగింది కానీ ఆశ వర్కర్ల వేతనం మాత్రం నేటికి అంతే ఉందన్నారు. ఆశల పట్ల వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఫిబ్రవరి 16న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశం

ఖైరతాబాద్, జనవరి 30 : మాల, మాదిగలతో పాటు ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 80 శాతానికి పైగా ఉన్నారన్నారు. కుల గణన చేయకపోవడం వల్ల విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో వెనుకబడిపోయారన్నారు. ప్రభుత్వం కులగణన చేపడుతామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కులగణన తర్వాత నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. 59 ఎస్సీ ఉపకులాల వారికీ కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ ద్వారానే ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయిల లక్ష్మీనర్సయ్య, చంద్రగిరి సత్యనారాయణ, రామారావు, శ్రీనివాస్, నాగయ్య స్వామి, పరమేశ్వర్, సతీశ్, అశోక్ పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ఖైరతాబాద్, జనవరి 30 : ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ పుల్గం మోహన్ , ఉపాధ్యక్షులు లక్ష్మీ రాజం, డి. రవివర్మ, నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, కోశాధికారి పోషెద్రి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తాం

మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్‌లో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 30: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందుగానే మరమ్మతు పనులను పూర్తి చేస్తున్నామని రంగారెడ్డి జిల్లా సీజీఎం ఆనంద్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను సీజీఎం ఆనంద్, ఎస్ఈ గోపయ్య, డీఈ రత్నాకర్‌రావు, డీఈ(లైన్స్) చంద్రశేఖర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీజీఎం ఆనంద్ మాట్లాడుతూ.. సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తాత్కాలిక పెండింగ్ పనులు, మరమ్మతు పనులను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా మరమ్మతులు చేపట్టి సరఫరా నిరంతరం అందించడానికి పనులను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గగన్‌పహాడ్ సబ్ డివిజన్ ఏఈ ఈశ్వర్‌ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ 55 కేజీల విభాగంలో మొదటి బహుమతి సాధించిన ఆర్నాల్డ్ జిమ్ క్రాంతికుమార్

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ

శంషాబాద్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శంషాబాద్ రూరల్, జనవరి 30: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని శంషాబాద్ ట్రాఫిక్ సీఐ రాజు సూచించారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెంట్ ధరించాలని సూచించారు. హెల్మెంట్ ధరించడంతో రోడ్డు ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. దీంతో పాటు లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్

మణికొండలోని షిర్డీసాయినగర్ సుందర్ గార్డెన్‌లో ప్రారంభమైన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాకు మహిళల నుంచి ఆదరణ లభిస్తున్నదని నిర్వాహకులు అక్బర్ అలీ మంగళవారం తెలిపారు. ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్ పూర్, డిజైనర్ , కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ శారీస్, లేడీ ఫ్యాన్స్ టాప్స్, డిజైన్ బ్లౌజ్, లక్నో చికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి టాయ్స్, తదితర వస్తువులు మేళాలో ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నెల 26న ప్రారంభమైన ఈ మేళా ఫిబ్రవరి 18 వరకు కొనసాగుతుందని, ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

యూసుఫ్‌గూడలో సిబ్బందితో కలిసి రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు చేపడుతున్న న్యాక్ ఏఈ వెంకటేశ్

ముమ్మరంగా రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు

జూబ్లీహిల్స్, జనవరి 30 : దెబ్బతిన్న రహదారులకు జీహెచ్‌ఎంసీ అధికారులు ముమ్మరంగా మరమ్మతు పనులు చేపట్టారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో వర్షాలతో గుంతలు పడ్డ రోడ్లకు.. వాటర్, సివరేజీ లైన్ల మరమ్మతు పనులతో దెబ్బతిన్న రోడ్లకు బీటి, సీసీ ప్యాచ్‌వర్క్ పనులు చేపడుతున్నారు. మంగళవారం యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్ లేబర్ అడ్డా రోడ్‌లో న్యాక్ ఏఈ వెంకటేశ్ సిబ్బందితో కలిసి రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టారు. వర్షాలకు, వాహనాల దాటికి పూర్తిగా దెబ్బతిన్న రహదారులలో మరమ్మతు పనులు చేపడుతున్నామని ఈఈ రాజ్‌కుమార్ తెలిపారు.

పనిచేస్తున్న ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, జనవరి 30: పనిచేస్తున్న ఇంట్లో వజ్రపు చెవిదిద్దులు కాజేసిన పనిమనిషి పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.12లో నివాసం ఉంటున్న ఉదయ్ సంఘీ అనే వ్యక్తి కుటుంబసభ్యులు వారి ఇంట్లో ఈనెల 26న డ్రెస్సింగ్ టేబుల్ కప్ బోర్డులో మూడు చెవిదిద్దులు పెట్టి మర్చిపోయారు. మంగళవారం ఉదయం డ్రెస్సింగ్ టేబుల్‌లో చూడగా అవి కనిపించలేదు. దీంతో తమ ఇంట్లో పనిచేసే కళ అనే పనిమనిషి వాటిని తస్కరించి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ.. ఉదయ్‌సంఘీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

మణికొండ, జనవరి 30: రాత్రిపూట ఎవరూ లేని సమయంలో ఏటీఎంలో దొంగలు పడ్డారు. ఎంతకీ క్యాష్ రాకపోవడంతో మిషన్‌ను ధ్వంసం చేసేందుకు యత్నిస్తుండగా సైరన్ మోగింది. దీంతో అక్కడి నుంచి పరారయ్యారు. వివరాల్లోకి వెళ్తే...నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్ సన్‌సిటీ వద్ద ఓ ఏటీఎంలో దొంగతనం చేసేందుకు సోమవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు యత్నిస్తుండగా సైరన్‌మోగడంతో పారిపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు నార్సింగి పోలీసులకు సమాచారం అందించగా.. వెంటనే అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం వెతుకుతున్నారు.

మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కుమారస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 30: నేటి యువత మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి అన్నారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ ఉపాధ్యక్షులు రమేశ్ రెడ్డి, ప్రవీణ్, మురళి, పాఠశాల ఇన్‌చార్జి ఆర్. జంగయ్య, అంగన్‌వాడీ టీచర్లు అనిత, మాధవి, ఉపాధ్యాయులు ప్రదీపా, పార్వతి, చంద్రకళ, విజయేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 30: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం రెవెన్యూ డివిజన్ అధికారిని కలిసి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సర్వే నంబర్ 9,14,15, 16లలో ప్రభుత్వ భూమి ఆక్రమణలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికిందర్‌గూడలో 20 ఎకరాల ప్రభుత్వ భూమి రికార్డుల్లో ఉందన్నారు. కొంత కాలం క్రితం భూమి ఆక్రమణకు గురి అవుతుండటంతో అప్పటి ఆర్డీవో, ఎమ్మార్వోలు ఈ భూమిలో ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ భూమి సుమారు 600 కోట్లు విలువ చేస్తుందన్నారు. ఆరు నెలలుగా గుర్తు తెలియని భూ కబ్జాదారులు భూమిని చదును చేయడంతో పాటు రోడ్డు, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే ప్లాట్లు చేసి అక్రమ నిర్మాణాలకు తెగబడుతున్నారన్నారు. వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో బీజేఎంసీ అధ్యక్షుడు మహేశ్ యాదవ్, శేఖర్, పి.ఎస్.మల్లారెడ్డి, పవన్‌సాయి, సాయి, నవీన్‌రెడ్డి, శివగౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that my client Sri. Yerramalla Shyam Sundar, General Power of Attorney Holder of Smt. Yerramalla Soumya @ Smt. Soumya Gandham, has lost the original link Sale Deed registered in name of Sri. Chigullapalli Lokesh S/o. Satyanarayana, bearing document No. 9911 of 1979, dated 27-09-1979, at Sub-Registrar's office, Hyderabad-East (presently called as SRO Hayathnagar). On 25th January 2024 at about 5:30 P.M., when he was going on his two wheeler motor cycle from Vittalwadi to YMCA Narayanaguda, if any person found the said Document may handover the same to the under signed within (7) days from this